AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
22-8-2026 (Saturday) MAIN EDITION

## చింతగింజలు గొంతులో ఇరుక్కుని బాలుడి మృతి



**అక్షరటుడే, ఆదిలాబాద్:** చింతగింజలు తింటుండగా.. ప్రమాదవశాత్తు అవి గొంతులో ఇరుక్కుని ఊపిరాడక తొమ్మిదేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన ఆదిలాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. మంకేష్ (9)కు చింతగింజలు తినే అలవాటు ఉన్నట్లు తెలిసింది. శనివారం చింతగింజలు తింటుండగా ఒక్కసారిగా అవి గొంతులో ఇరుక్కుపోవడంతో బాలుడికి ఊపిరి ఆడలేదు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ బాలుడు మృతి చెందాడు.

## మెగాస్టార్ 'కాకా' మూవీ గ్లింప్స్ విడుదల



**అక్షరటుడే, సినిమా డెస్క్:** మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఫ్యాన్స్ కోసం కొత్త చిత్రం గ్లింప్స్ విడుదల చేశారు. బాబీ కొల్లి దర్శకత్వంలో చిరు నటిస్తున్నాడు. ఆ సినిమా పేరు తాజాగా చిత్ర బృందం ఖరారు చేసింది. కాకా పేరుతో రూపొందుతున్న ఈ సినిమాలో మెగాస్టార్ మరోసారి వింటేజీ లుక్‌తో అదరగొట్టాడు. పవర్‌ఫుల్ మాస్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా గ్లింప్స్‌తో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

### ఐపీవోకు గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ అగ్‌మోంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఐపీవోకు వచ్చింది. మార్కెట్ నుంచి రూ. 825 కోట్లు సమీకరించనుంది. ఆగస్టు 21న ప్రారంభమైన సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ 25 వరకు కొనసాగనుంది. ఆగస్టు 27న షేర్ల కేటాయింపు ఖరారు అవుతుంది.




### భారీగా గంజాయి పట్టివేత

**అక్షరటుడే, హైదరాబాద్:** అరకు నుంచి ముంబైకి రూ. 10 లక్షల విలువైన 38 కిలోల గంజాయిని తరలిస్తున్నారనే ఆరోపణతో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అనుమానం రాకుండా ఉండేందుకు ఈ మాదకద్రవ్యాల ముఠా వృద్ధులను 'క్యారియర్లు'గా ఉపయోగించిందని పోలీసులు అనుమానిస్తున్నారు.



### స్కూల్ ఎడ్యుకేషన్, టి-సాట్ మధ్య ఎంఓయూ

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అన్ని వేళలా ఆన్ లైన్ ద్వారా అందించాలనే లక్ష్యంతో స్కూల్ ఎడ్యుకేషన్, టి-సాట్ మధ్య ప్రత్యేక అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందనున్నాయి.



# కూలిన ఏడంతస్తుల భవనం



▪ గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఘటన ▪ ఇద్దరు మృతి
▪ 50 గజాల్లో అక్రమంగా నిర్మాణం ▪ సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

**హైదరాబాద్ నగరంలో విషాదం చోటు చేసుకుంది. గచ్చిబౌలిలో ఇటీవల నిర్మాణం పూర్తయిన భవనం శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. తక్కువ స్థలంలో, నాలాను ఆక్రమించి అక్రమంగా భవన నిర్మాణం చేపట్టడంతో అది కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

గచ్చిబౌలిలోని లోని అంజయ్యనగర్‌లో నాలాను ఆక్రమించి 50 గజాల్లో 7 అంతస్తుల భవనం నిర్మించారు. పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. అద్దెకు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో అది ఒక్కసారిగా కూలిపోయింది. పక్కన అపార్ట్‌మెంట్‌పై భవనం కూలడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

**రెండు మృతదేహాలు లభ్యం**

పోలీసులు, సహాయక బృందాలు శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అని గాలింపు చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగిస్తుండగా.. రెండు మృతదేహాలు లభ్యం అయ్యాయి. ప్రమాద సమయంలో భవనంలో ఎంత మంది ఉన్నారనే వివరాలు తెలియరాలేదు. ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అని గాలిస్తున్నారు.

**అక్రమ నిర్మాణం**

తక్కువ స్థలంలో, నాలాను ఆక్రమించి నిర్మాణం చేపట్టడంతో కూలినట్లు తెలుస్తోంది. 50 గజాల స్థలంలో 7 అంతస్తుల భవనం నిర్మించడానికి వీలు లేదు. నిర్మించినా.. కింద సపోర్టు లేక కూలిపోయే అవకాశాలు ఉంటాయి. అయినా కూడా యజమాని, బిల్డర్ అత్యాశతో నిర్మాణం చేపట్టారు. దీంతో అది కూలిపోయింది. భవనం కూలడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ సైతం స్వల్పంగా ధ్వంసమైంది. అందులో ఉన్న పలువురికి గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు. అయితే అంత తక్కువ స్థలంలో ఏడు అంతస్తుల నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. భవన యజమాని, బిల్డర్, పర్మిషన్ ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నిషేధిత జాబితా పేరుతో భూములు కబ్జా



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితా పేరుతో భూములు కబ్జా చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఇళ్లను కూడా ఈ జాబితాలో చేర్చడం దుర్మార్గం అన్నారు. బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన పలువురు 22A బాధితులు శనివారం హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22A నిషేధిత జాబితాలో చేర్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డు పెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి వివాదాలు సృష్టిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు.

## ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్



**అక్షరటుడే, యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెంలోని హెజీలో ఫార్మా కంపెనీలో శనివారం భారీ ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని రియాక్టర్ పేలడంతో ముగ్గురు కార్మికులు మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారు. మృతులను నాగిరెడ్డి, నరేష్, రాజశేఖర్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు.

## అమెరికా–కెనడా వాణిజ్య చర్చలు విఫలం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా-కెనడా వాణిజ్య చర్చలు విఫలం అయ్యాయి. దీంతో కెనడాపై అమెరికా 50శాతం టారిఫ్‌లు విధించింది. శనివారం తెల్లవారుజామున నుంచే ఇవి అమలులోకి వచ్చాయి. అమెరికా, కెనడా మధ్య చివరి నిమిషంలో జరిపిన చర్చలు విఫలమవడంతో, 20 బిలియన్ డాలర్ల విలువైన కెనడియన్ ఉత్పత్తులపై శనివారం తెల్లవారుజామున 50 శాతం సుంకాలను విధించడానికి యునైటెడ్ స్టేట్స్ సిద్ధమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించనున్న ఈ దిగుమతి పన్నులు, కెనడా ప్రతి సంవత్సరం యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసే వస్తువులలో సుమారు 5 శాతంపై ప్రభావం చూపుతాయి.

## తేజస్ యుద్ధ విమానాలపై కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, ఢిల్లీ :** దేశీయంగా అభివృద్ధి చేసిన తేజస్ యుద్ధ విమానాలపై భారత వైమానిక దళ మాజీ వైస్ చీఫ్ నాగేష్ కపూర్ ఒక కీలక వ్యాఖ్యలు చేశారు. 2030ల మధ్యకాలంలో 'తేజస్ Mk2' యుద్ధ విమానాలు పెద్ద సంఖ్యలో సేవల్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే అవి యుద్ధ రంగంలో ముందు వరుస (ఫ్రంట్‌లైన్) పాత్ర పోషించడానికి సరిపోవని తెలిపారు. చైనా ఇప్పటికే 6వ తరం విమానాల వైపు అడుగులు వేస్తుండగా.. 2035 నాటికి భారత్ వద్ద 4వ తరం విమానాలు ఉండటం సమంజసమేనా అని ప్రశ్నించగా.. ఆయన స్పందించారు. తేజస్ యుద్ధ విమానాలు అత్యంత అధునాతనమైనవి కాకపోయినానిర్దిష్ట పాత్రను పోషిస్తాయన్నారు.



## అనకాపల్లి దేశంలో నంబర్ వన్ : చంద్రబాబు

**అక్షరటుడే, ఏపీ :** అనకాపల్లి అంటే బెల్లం ఒక్కటే కాదని, ఇండస్ట్రీయల్ ఏరియా అని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాబోయే రోజుల్లో అనకాపల్లి దేశంలోనే నెంబర్ వన్ అవుతుందన్నారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం అలమండలోని స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. తాము చేసిన పనిని అభిమానిస్తే అదే పెద్ద కిక్ అన్నారు. తనకుకు ఎప్పుడూ సవాళ్లే అని పేర్కొన్నారు. డేటా సెంటర్ వస్తే నీళ్లు దొరకవంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డేటా సెంటర్ అంటే ఏంటో తెలియని వాళ్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

## శ్రీశైలం ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

**అక్షరటుడే, శ్రీశైలం :** శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో కంటే ఔట్ ఫ్లో అధికంగా ఉంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం 45,192 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 166.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. కుడి గట్టు కేంద్రంలో ఉత్పత్తి నిలిపి వేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి 48,444 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది. ఇన్‌ఫ్లో కంటే ఔట్ ఫ్లో అధికంగా ఉండటంతో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది.



## పాక్‌తో సంబంధాలు.. కర్ణాటకలో ఒకరి అరెస్ట్



**అక్షరటుడే, బెంగళూరు :** పాకిస్థాన్‌తో సంబంధాలు కలిగి ఉన్న ఓ వ్యక్తిని కర్ణాటకలో పోలీసులు అరెస్ట్ చేశారు. దొడ్డబళ్లాపూర్‌లో సయ్యద్ అబూబకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడికి రెండేళ్లుగా పాక్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. దొడ్డబళ్లాపూర్‌లోని ఇస్లాంపూర్‌లో ఉన్న తన ఇంట్లో సయ్యద్ అబూబకర్ అనే నిందితుడిని అరెస్టు చేశారు. అతను ఏసీ రిపేర్‌మెన్‌గా పనిచేసేవాడు. అంతేగాకుండా బెంగళూరులోని ఒక మసీదులో బోధించేవాడు. అబూబకర్ దాదాపు రెండేళ్లుగా ఒక పాకిస్తానీ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ఖాతాతో సంప్రదింపులు జరుపుతున్నాడు. ఈ గ్యాంగ్ ప్రముఖ వ్యక్తులను, వ్యాపారవేత్తలను బెదిరించి, డబ్బులు వసూలు చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

## రేపటి నుంచి భారీ వర్షాలు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** రాష్ట్రంలో గత నాలుగు రోజులు వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు గుడ్ న్యూస్ చెప్పారు. అల్ప పీడన ప్రభావంతో రేపటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 27 వరకు వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. కాగా ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు అయింది. సాధారణ వర్షపాతం 505.2 మి.మీ. కాగా.. ఆగస్టు 21 వరకు 432.6మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. 14 శాతం లోటు వర్షపాతం నమోదు అయింది.

